# 1

# నాగలోకం

*అసలు నాకు తెలవకడగతాను బంగళాల్లో పుట్టినోళ్ళు బంగళాల్లోనే కదా వుంటారు. గుడి సెల్లో పుట్టి నోళ్ళు గుడి సెల్లోనే కదా వుండాల. కాలిగోళ్ళు తలెంటికల్తో ఎట్టా పోటీ వత్తాయి.*

"దండాల్సామే... నమస్తేసా... నాపేరు యెంకటమ్మ... ఈ హోల్ మొత్తం బంగారం పేటకి నేను 'యెంకటి'నే కానీ... నిజంగా బంగారాన్ననే పేరు తెచ్చుకున్నాసా.... ఆ పోలేరమ్మ సాచ్చిగా సెప్తా వుండాను. నేను ఒక్కరి చేత ఒక్క మాటన్పించుకోకుండా అంత గొప్పగా బతికినానండ్యా ...ఎవురయినా సావడా నికి పోతా పోతా అపద్దం చెప్తారా సెప్పండి. మా రెడ్డెమ్మయితే నన్ను అంతా యిదిగా మెచ్చుకుంటాది. నెత్తిమీద గింజ నేలబడి నేనీ వూరికొచ్చింది మొదల్చేసి ఆయమ్మ దగ్గిరే పన్జేస్తుండానే. ఆయమ్మకి తెలవదా నా సంగతి. తెలవక పోతే 'యెంకటి మాలోళ్ళల్లో పుట్టా ల్సిందే కాదు అంతా మంచి బుద్ధి దానికి... గొప్పింట్లో పుట్టాల్సిన మనిషి' అని అంత గొప్ప గా దేని సెప్తాది... ఆయమ్మ ఆ మాదిరిగా సెప్తా వుంటే నాకు కోడి కూర నంజుకొని సంగటి తిన్నంత ఆనందంగా వుంటాది.

మఉూరాలు శేరు నాలుగు రూపాయ లమ్మిన్నాటి నుండీ ఈ పొద్దుటిదాకా ఏనాడైనా

ఆయమ్మ యింటికి పనికి పోకుండా వుణ్ణ్యానా? ఆయమ్మ కాల్తో చెప్పిన పని సేత్తో సేసుకుపోతినే... ఏ పొద్దయినా ఒక్కమాట ఎదిరిచ్చి ఎరిగుందునా? ఏ పూటయినా అది పెట్టలేదు. ఇది పెట్టలేదని మాట్లాడి వుందునా? ఆయమ్మ ఏది చెప్తే అదే నాకు భారతం, రామాయణం.

ఇదిగో ఈ పనికిమాలిన ముండ పుట్టినప్పుడు దీనికి 'అరుణ' అని పేరు పెట్టింది ఆయమ్మే కదా, మాకెందుకు తల్లా అట్టాటి పేర్లు ఏదో రంగమ్మ, చెంగమ్మ, పెంచిలమ్మ అని పెట్టుకుంటానంటే ఆయమ్మ ఒప్పుకున్నాదా? 'ఎంతసేపూ ఆ పేర్లే ఎందుకు పెట్టుకోవాలే... మీరు మాత్రం మంచిపేర్లు పెట్టుకోకూడదా ఎవురు చెప్పారే? ఎక్కడుందా రూలూ? అనింది.

"వొద్దమ్మా మాయిళ్ళల్లో ఎగతాళి చేస్తారు," అంటే

"ఎన్ని రోజులు చేస్తారే!...ఒకరోజు చేస్తారు, రెండు రోజులు చేస్తారు.. ఆ తర్వాత చేస్తారా?" అంటూ రూల్సులు మాట్లాడింది. ఆయమ్మ 'అరుణా' అని ముద్దుగా దీన్ని పిలుస్తూంటే గొప్పింటి బిడ్డ మాదిర్నే అన్పించేది ఈ పిల్ల... యాం చేస్తాం గొప్ప పేరు పెట్టుకుంటే మాత్తరం గొప్ప బుద్దులొస్తాయా? అంతా నా ఖర్మ.

మొదుటి 'కాడి' నేరుగా పోతే యెనక 'కాడి' గాడి తప్పదంటారు. అట్టా మొదుటోడు సరిగ్గా వుంటే నాకు అంతా సరిగ్గా వుణ్ణు. కట్టుకున్నోడు తాగి తాగి చావ బాదతా వుంటే బిడ్డలన్నా కడతేరస్తారనే ఒక యిదితో బతికితినే... బిడ్డల్లో యింకా జాస్తిగా వుండాదే సామే... ఒకందాన రాయలేదు నాకా బగమంతుడు.

ఎప్పుడయినా, ఎన్ని బాధలొచ్చినా పెద్ద రెడ్డోళ్ళని ఎదిరిచ్చి వుందునా? ఇప్పటి కాలప్పిలకాయలు ఏం చెప్తా వుండారో, ఏం చేస్తా వుండారో నాకేమీ తెలవడం లేదు. వోళ్ళు బంగళాల్లో దేనికుండాలా? మనము ఈ గుడిసెల్లో దేనికనేసుండాలా అని అడగతారు. వోళ్ళకి మాత్రం అన్నెకరాల నేలుండేదేంది?... మనకసలు నేలే లేదేంది? అనడగతారు. అసలు నాకు తెలవకడగతానూ బంగళాల్లో పుట్టినోళ్ళు బంగళాల్లోనే కదా వుంటారు. గుడిసెల్లో పుట్టినోళ్ళు గుడిసెల్లోనే కదా వుండాల. కాలిగోళ్ళు తలెంటికల్తో ఎట్టా పోటీ పడ్తాయి. ఈ పిలగాళ్ళకేమీ ఒళ్ళు తెలీడం లేదు. ఎగిరెగిరి పడ్తా వుండారు. ఎప్పుడో దబ్బున కూలబడబోతారు.

కోడికూసే యేళకి లేసి రెడ్డోరింటికి బోతే రేత్రి తొమ్మిది గంటల బస్సొచ్చే దాకా వంచిన నడుమెత్తకుండా పన్జేసుకుంటా నాపాటకి నేను బతకతా వుంటినే. ఇప్పుడేంది సామే యిట్టాటి కష్టమొచ్చేసింది నాకు. ఇప్పుడేం జేయాల తల్లా నేను. కళ్లకు గంతలు కట్టేసి నట్టనడి రోడ్డు మీద వొదిలేసి నట్టుగా అయోమయంగా వుండాది నాకు.

ఆ రెడ్డోరబ్బయ్యకి పెపంచంలో యింతమంది ఆడోళ్ళుండగా మా అరుణమ్మే కంటక్కనబడాలా?... ఖర్మ కాకుంటే... ఒకాళ ఆయబ్బయ్యేందో వయసు మీదుండాడు కావాల్సి మాట్లాడిచ్చినాడనుకో దీనికయినా బుద్దనేదుండబళ్ళా?... మనమేంది? వోళ్ళేంది?

పేమలేంది దోమలేంది అని కొంచెమయినా ఆలోచించుకోవాల్సిన పన్లేదా? పోయిన సంవస్సరం కాడ్నించి ఈ సూపులన్నీ చూసి చూసి, ఇహన రెడ్డోరబ్బయ్యనేవీ అన్లేక దీన్ని చావబాదితిని... ఇహన యిట్టా గాదన్చెప్పి నా తమ్ముడ్ని బతిమాలి, బామాలి వాడికిచ్చి అరుణమ్మిని కట్టబెట్టేస్తిని....సరే మంచో చెడో మూడు ముళ్ళు బడిపోయినయి, దాని పాటికది వాళ్ళూరికి బొయ్యి కాపరం చేసుకుంటుందాదని వొదిలేయొచ్చు కదా. ఆ సురేషయ్య అంతటితో గమ్మునుండకుండా దానత్తగారూరికి పొయ్యి 'అరుణా నాతో గూడ వస్తావా రావా?' అని పిలిచినాడంట... దాని మొగుడప్పుడు పనికి పొయ్యున్నాడంట.

ఆ యెర్రిముండ, పనికిమాలిన ముండ, కొవ్వుబట్టిన ముండ దాన్నెత్తిన ఏ శని దాపరించిందో, ఏ పురుగు తొలిచిందో, దాని టైమట్టుందాది వోడితో గూడ బడిపొయ్యిం దంట.

ఇదంతా రెడ్డిగోరికి తెలిసి పొయ్యిండాది. రెడ్డసాని నన్ను పిలవనంపింది.

"ఏమే యెంకిటా?... నేన్నీకేం ద్రోహం జేస్తినే... ఎట్టెట్ట జూసుకున్నాన్నిన్ను... నా నోట్లోకి పోయేది నీ చేతిలో బెడ్తిని కదే. 'అరుణ' అని నేను స్వయంగా పేరు పెట్టి ఆయమ్మికి నా కూతురి గుడ్డలన్నీ కట్టబెడ్తినే... నువు పన్లోకి పంపిస్తానంటే వొద్దులేయే సదూకోనిమ్మంటనే, ఇదేనా నాకు మీరు చేయాల్సిన శాస్తి..." అంటూ ఏందేందో మాట్లాడేసింది. నాకేవీ అర్థం కాకపాయ.

ఏ పొద్దయినా ఆయమ్మ నన్ను తిట్టెరుగుణ్ణా... ఈ చెడబుట్టిన ముండా దానిచేత ఎన్నెన్ని మాటలడిగించుకుంటా వుండాను వూరందరి చేత. రెడ్డోరింట్లో కారు డైవోరు మొదలుకొని వాచిమేను రంగయ్య దాకా అందరూ ఎన్నెన్ని మాటలడిగినారు. కడుపుకు కూడు దింటుండావా లేదా అన్నారు. స్వామి ద్రోహం చేస్తే వచ్చే జనమకి ఈ పుట్టే కూడు కూడ పుట్టదన్నారు. రెడ్డయితే దాంతో ఏందిరా మాట్లాడేది 'ధ్ఫూ' అని నామీద ఎంగిలూసి గేటు అవతలికి నెట్టించేసినాడు.

అప్పటికప్పుడు మాయమ్మోళ్ళూరికి పరిగెత్తితిని. మాయమ్మ ముసిలిముండ బయట కుక్కి మంచంలో పాడుకొని గొణుగతా ఏడ్చుకుంటా వుండాది. లోపలికి బోతే తమ్ముడు ఒక్కడే సాప మీద పడుండాడు మొహానికి చెయ్యడ్డం పెట్టుకొని.

'ఏమయిందబయ్యా' అని అడిగితే యాడ తంతాడోనని బయపడ్డాను. ఎంత కయినా తోడబుట్టినోడు కదా, నేనొచ్చింది చూసి 'కూచోక్క' అన్నాడు.

నాకేం మాట్లాడాలే తెలీక పాయ.

"నువ్వీ పెళ్ళి చేసుండాల్సింది గాదక్కా" అన్నాడు వాడే కాసేపటికి. "గుర్రాన్ని నీళ్ళ కాడికి లాక్కుపోగలమే గానీ నీళ్ళు తాగించగలమా చెప్పు?" అని కూడా అన్నాడు.

నా కడుపు తరుక్కుపోయింది .

"అవును నాయినా నీ బతుకు పాడు జేసినాన్రా" అట్టంటుంటే నాకు తెలీకుం డానే ఎక్కిళ్ళు పెట్టుకుని ఏడుపొచ్చేసింది. "నన్ను గురించి ఎన్ని బాధలు పడ్తుండావురా అబయ్యా" అన్నాను మళ్ళీ.

"బాధలేందే వూరంతా ఎన్నెన్ని మాటలడగతా వుండారో తెలుసా? యిన్లేక సెవులు మూసుకుంటుండాము. బిడ్డ పనికి పోయి కూడ నాలుగు దినాలయిపోయింది." అనింది మాయమ్మ. నేనొచ్చిన సంగతి గమనించి మెల్లిగా లోపలికొచ్చిండాది. "ఇహన అది తిరిగొస్తే కూడ ఈ యింటిగ్గా దాన్ని రానిచ్చేదానికిలే " అన్నది.

తమ్ముడు కూడ అంతేనన్నట్లుగా వుండాడు. దాని బుద్ధి తెలిసుండి కూడా నా బంగారంటి తమ్ముడు యెంకటయ్యకి దాన్ని కట్టబెట్టడం నా తప్పే. ఏం చేసేదిరా బగమంతుడా అని యేడస్తా ఆ పొద్దంతా అక్కడ్నే వుండిపోయినా, మా వూరికి పోయే దానికి మొహం చెల్లకుండా.

ఆ పొద్దుటికి మూడు దినాలయిపోయింది... ఈ ముండా కన్నాబిడ్డ యింటి కాడ్నించి యెల్లిపోయి... మల్లా నాలుగు దినాలు పోయిన పాట నా కొడుకొచ్చినాడు నన్ను యెతుకులాడుకుంటా.

"ఏందిమా యింటికి రాకుండా ఈడ్నే వుండావు" అన్నాడు.

దానిక్కూడ ఏడుపు తప్ప యింకేం రాలేదు నాకు. అవతల వొడే చెప్పకొచ్చినాడు.

"రెడ్డోరి మనుషులు అంతా యెతుకులాడి ఆడేడ్నో తిరపతి అవతల లాడ్జిలో వున్నారని సురేషయ్యనీ, అక్కనీ తీసుకొచ్చినారు. నాయిన్ని పోలీసోళ్ళు తీసకపోయి టేషన్లో యేసుండారు. అక్క ఒకిటే వుండాది యింటికాడ. నువు రామా పోదాం" అంటా యింటికి పిలసకపాయ.

దాని మొహం చూడాలంటేనే మండిపోతుండాది నాకు . పోతానే కొరివి కట్టొకటి తీసుకుని వాతలు తీయాలనుకున్నా... రెడ్డోరు దయతల్చి పోలీసోళ్ళతో చెప్పి మా యింటా యిన్ని వొదిలేయిస్తే వూళ్ళోనే వుండకుండా యాడయినా దూరంగా పోయి పడుంటా మనుకున్నా. ఇన్ని ఆలోశన్లూ సేసుకుని నేనింటి కాడికి పొయ్యేటప్పటికి సామే నా యింట్లో పెద్ద పెద్ద మాటలు జరిగిపోతా వుండాయి. మీ బాసలో సెప్పాలంటే రాజ కీయాలు సామే. అయ్యి యినటానికి కూడా నాకు ఆగిత పళ్ళేదయ్యా.

కాపోళ్ళ రవిబాబు మా వాకిట్లో కుర్చీ యేసుకుని కూకోనుండాడు. యెంకట్రాజు కొడుకు సుధాకర్రాజు గుడిసె వాకిట్లో నిలబడి లోపలికి సూస్తా వుండాడు. అప్పటికే మా యింటాయిన్ని ఎవురు బయటికి తీసుకొచ్చినారో, ఏమో తెలవదుగానీ లోపల కింద సాపమీద కూకోని కూతురితో ఏందో సెప్తా వుండాడు.

ఇయ్యంతా ఏందో, ఈళ్ళంతా యేమేం మాట్లాడుకుంటుండారో, ఏమీ జరగతా వుండాదో నాకేవీ తెలవలే...

ఇంతలోపికి మా వోళ్ళబ్బయ్య కస్తూరి గొట్టుపల్లి నుండి ఎనిమిది గంటల బస్సుగ్గావాల దిగినాడు. వోడు వోళ్ళూరికి పెసిడెంటుగా వుండాడు. మా కులపోళ్ళకి ఎక్కడ ఎవురికేం అన్యాయం జరిగినా నేనుండానంటా వచ్చేస్తాడు. మనిషి మంచోడు. అందరినీ అక్కరగా జూస్తాడు.

కస్తూరయ్య రావడం చూసి సుధాకర్రాజుఎదురుపోయి ఏందో మాట్లాడినాడు. అందుకు కస్తూరి కూడా "అట్నే చెయ్యాల్సిందే" అంటూ తలూపుతుండాడు.

నేను నిలువుగాళ్ళ మీద నిలబడే వుండాను.

నిలువు గుడ్లేసుకుని సూస్తానే వుండాను. నేనొచ్చిన సంగతి కూడ చూడనట్లుగా అందురూ అరుణమ్మిని తీసుకుని బయల్దేరారు. అంతా యాడకి పోతుండారో నేనెరగను. నా మొగుడిక్కాడ నేను కంట్లో నలుసయి పోయినాను. పెద్ద మొనగాడి మాదిరి వోళ్ళందరితో గూడ చేతులూపుకుంటా పోయినాడు. నా కొడుకయితే సినిమాలో 'ఈరో' మాదిరిగాను అనుకుంటుండాడు. నేను నిరామయంగా సాప మీద పడిపోయాను. ఒళ్ళంతా సలవలు కమ్మినట్టయి పోయింది నాకు.

ఆ మద్దినేల మూడు గంటలయ్యుంటాది నరసమ్మొదినె వచ్చి నన్ను నిద్ర లేపింది. "లెయ్యి యెంకటా యిదిగో ఈ గెంజి నీళ్ళయినా తాగు. పొద్దనెప్పుడు బయిదేల్నావో ఏమొ. ఇట్ట తినకుండా, తాక్కుండా ఎన్నాళ్ళుంటాం చెప్పు..." అంటా నాచేత గెంజి తాగిచ్చింది.

నేను మెల్లిగా లేసి కూచ్చోని గెంజి తాగినాను. మళ్ళా నరసమ్మే చెప్పింది. "యెంకటా మనకెందుకుమే పెద్దోళ్ళతో... ఏదో అయ్యింది పొయ్యింది గుట్టుగా అరుణమ్మిని మీ అమ్మోళ్లింటి కంపేయగూడదా? ఇయ్యేవన్నా సినిమాలా చెప్పు. వోళ్ళింటి ముందు పోయి కూసోని తిండి, తిప్పలూ లేకుండా పోరాటం చేయటానికి. అరుణమ్మి ఎన్ని రోజులిట్టా కూడూ, నీళ్ళూ లేకుండా కూసుంటే మాత్రం పెదరెడ్డి మనసు కరగతాదా? ఆ యింటి కోడల్ని సేసుకోడానికొప్పుకుంటాడా చెప్పు? అయ్యంతా జరిగే పన్లు కాదులేమే...

ఇట్టాటియన్నీ పొరబైటికి రానీకుండా మనలోమనం మింగుకోవాలా. ఇన్నేళ్ళు గా వోళ్ళ వుప్పు, పులుసూ తిని బతికితిరే అట్టాటి రెడ్డసానికి మనమే ద్రోహం చేయొచ్చునా?... ఆలోశన సెయ్యియే"

నరసమ్మ చెప్పింది యినేతలికి నాకు నోట్లో చెమ్మలేదు. ఉణ్ణెట్టుండి కడుపులో తిప్పతా వుండాది. తల పగిలి పోతా వుండాది. నరసమ్మ చెప్పింది నాకేమీ అగిత పడ్డం లేదు .... వాంతికొచ్చేట్టుగా వుండాది .

"ఏందా? నా కూతురు అరుణమ్మి పెద్దరెడ్డి కోడలా?...సురేషయ్య భార్యా?... యాడయినా వుండాదా ఈ కత... ఈ కాలప్పిలకాయల బుద్దులే మారిపోతా వుండాయి. మనమేడ, వోళ్ళేడ అనే యోశనే చెయిడం లేదయా ఈళ్ళు. ఈళ్ళేంతనుకుంటే అంతే. ముందూ యెనకా లేదు. మా అరుణమ్మి ఆ యింటి కోడలా?

ఆ యింటికి ఎట్టాటమ్మి కోడలుగా రావాలని రెడ్డెమ్మ కలలు కంటా వుణ్ణిందో నాకు తెలుసు ... రెడ్డెమ్మ అన్న కూతురు శిల్పమ్మ నిజంగా చెక్కిన బొమ్మతో పాటుం టాది. సన్నంగా, తెల్లంగా, పొడుగ్గా పిండిబొమ్మ మాదిరి ఒంటి నిండా నగల్తో, పెద్ద

చదువుతో, చెప్పటానికి లేనంత ఆస్థిపాస్తుల్తో... అట్టాటి బొమ్మ ఈ పెదరెడ్డింట్లో తిరుగు లాడతా వుంటే ఆ బంగళాకి తగినట్లుగా ఎంత ధీటుగా వుంటాది. ఆయింటికి కళొచ్చును గదా... ఆ కలలన్నీ తుంగలో తొక్కి పారేసి ఈ సురేషయ్య ఎంత పని చేసేసినాడు. చేస్తే సేసినాడనుకో ఈ అరుణమ్మికయినా బుద్ధీ, సిగ్గూ వుండబళ్ళా?...చేసిన సిగ్గుమాలిన పనికి తోడు వోళ్ళింటి ముందర కుచ్చోని పోరాటం చేసేసింది. మవున పోరాటం... మాయా పోరాటం... ఏందమ్మే యిదంతా. నేనీతోపాటు యోశన చేస్తుండే లోపల్నే కస్తూరయ్య, మా యింటాయినా, సుధాకర్రాజు అంతా వొచ్చినారు. అరుణమ్మి రాలేదు. కస్తూరయ్యా నా పక్కనే వచ్చి కూర్చున్నాడు.

'అక్కా! యిదే మనికి మంచి అవకాశం. పెళ్ళయి సంసారం చేసుకుంటున్న బిడ్డని లేపుకుపోయి పద్దినాలు కాపరం జేసి తీసుకొచ్చినాడు. ఈ పొద్దు దాన్ని పంపిస్తా మన్నా దాని మొగుడేలుకునేట్టు లేడు. నిజిమా కాదా నువు చెప్పక్కా ఆయమ్మి బతు కంతా ఎట్ట గడవాల, నువు ఎల్లకాలమూ వుండి ఎల్లీదగలవా? అందుకే నీ కొడుకునీ, మీ యింటాయిన్నీ దీసుకునీ కలెక్ట్రు కాడికి పోదామనుకుంటుండాను"...కాసేపు ఆపినాడు కస్తూరయ్య.

ఉస్సూరంటూ ఊపిరొదిల్నాన్నేను. నాకు దీనికంతటికీ ఏమని జవాబు చెప్పాలో తెలీడం లేదు. మనమేంది? కలెక్ట్రు కాడికి పొయ్యేదేంది? ఈ పూటకి గెతిలేదు. 'ఓ' అంటే 'న' రాదు. కలెక్ట్రు దగ్గరికి పోతారంట కలెక్ట్రు దగ్గరికి. సెప్పేదానికయినా వుండాల, యినేదానికయినా వుండాల.

నేను గమ్మనే వుండడం జూసి కస్తూరయ్యే చెప్పినాడు మల్లా.

"అక్కా దీని కంతటికి మనకేం బయం లేదక్కా... అంతా ఆ మధుసూధ న్నాయుడే చూసుకుంటానన్నాడు. ఇదిగాని జరిగిందంటే నీ కూతురు ఆ యింటి కోడలయిపోతాదనుకో..."

"ఇహన మనకేం గావాల చెప్పే... అరుణమ్మి రెడ్డి కోడలయిపోతే మనమూ, రెడ్డోళ్ళూ అందరం కలిసిపోతాం. అందుకనేసి కలెక్ట్రు దగ్గరికి పోతుండాం న్యాయం జరిపించమని" మా యింటాయిన నన్ను ఉబ్బేయాలని సూస్తుండాడు.

కూతురు గొప్పింటి కోడలయితే తాగడానికి డబ్బులు చేతినిండా వుంటా యనుకుంటుండాడే గానీ... పరిస్థితేందా అని యోచన చెయ్యడం లేదా మనిషి, ఆ మధుసూదన్నాయుడికీ, మా పెదరెడ్డికి మొదుట్నించీ తగువులే. యాపారాల్లోనే గాదు రాజకీయాల్లో గూడ శత్రువులే. ఈ సురేషయ్య చేసిన ఈ పనికిమాలిన పనిని లోపంగా చేసుకొని రెడ్డిని ఎట్టయినా తొక్కేయాలని చూస్తుండాడు ఆ నాయుడు. అందుకే చిన్న దాన్ని పెద్దదిగా చేస్తుండాడు. నడవ మనల్ని అవసరానికి వాడుకుంటుండారని అర్థం కాబళ్ళే ఈయనకి.

సంకలెగిరేస్తా వుండాడు నాబట్ట కలెట్రు దగ్గరికి పోడానికి, ఆ నాయుడు చిన్న మనిషా?... ఈ పెద్ద రెడ్డి చిన్నటోడా... ఇద్దరి సందన దూరుకుని నలిగి సావటానికి చేస్తుందారిదంతా....

నా కొడుకూ, వాడెబ్బా , కస్తూరయ్యా, సుధాకర్రాజూ అంతా నేనేం చెప్పబోతానా అని చూస్తా వుండారు. నేను మాత్రం ముందూ యెనకా సూడకుండా ఖచ్చితంగా చెప్పేస్తిని. నామొగుడి సాయా, కొడుకు సాయా చూడకుండా.

"అబయా కస్తూరీ...మీకు కొంచెమయినా ఆలోశనుండాదా? నక్కకీ నాగలోకానికీ పొత్తేడ కుదరద్దీ. మనమ్మెంది వాళ్ళింటి కోడలయ్యేదేంది? మీకంతా పిచ్చిగానీ పట్టలేదు గదా. రెడ్డి మనమ్మిని బతకనిస్తాడనుకుంటుండారా? నట్టనడీధిలో పెట్టి నరికి పారేస్తాడు. చెప్పేదానికిలే... రేపు నాయుడు, రెడ్డి ఒకటయిపోయి మనల్ని పులుసులో కరేపాకు నేరినట్టు ఏరిపారేస్తారు.

అట్టాటివంతా జరిగి మనందరం కూలబడి ఏడవడం కన్నా యిప్పుడే గుద్దా, నోరూ మూసుకొని గమ్మున పడుంటే బాగుంటాది. యాడికబయ్యా మీరు కలెట్రు కాడికి పొయ్యేది... కలెక్టరు దగ్గరికి పోతారంట కలెట్రు దగ్గరికి..." యిదిల్చి పార్నూకినాను అందర్నీ.

నా మొగుడు, కొడుకూ నోరు తెరిస్తే ఒట్టు... కొడుకు నా తట్టు మిటకరించి చూస్తుండాడు... ఇదే అదునుగా తీసుకొని ఒకే దినంలో పెద్దోళ్ళనీ, చిన్నోళ్ళనీ అందర్నీ ఒకటిగా, సరిసమానంగా చేసేయాలని ఉదరు మీదుండాడు వాడు... పిచ్చినాయాల వోడికి తెలీడం లేదు యిదంతా అంత తేలిగ్గాదని. సరే మన అరుణమ్మి వాళ్ళ కోడలు గాకపోయినా, మనంగాన యిట్ట భయపెడ్తే మరింతగా డబ్బులిస్తారని ఆశగా కూడా వుండాది మా ఆయనకి. అందురూ కలిసి మళ్లీ ఏందో మాట్లాడబోయినారు నాతో. నేను పడ్నీలే వాళ్ళని. అంతా గమ్మనయి పోయినారు గానీ, కస్తూరి మాత్రం గమ్ముని వుండలేదు...

"అది కాదక్కా మన కలెట్రమ్మ ఆడమనిషి, మనూరి ఎమ్మార్వో ఆడమనిషి... మనోళ్ళామె (మన కులం), యిద్దరూ కూడా వొచ్చినప్పుడ్నుంచీ ఆడోళ్ళకి జరిగే కష్ట నష్టాల గురించే జాస్తిగా సూస్తా వుండారు. నీకు తెలవందేముండాది మన ఎమ్మార్వో వచ్చినప్పుట్నుండే కదా ఆడోళ్ళకి పొదుపులక్ష్మి గ్రూపులని, డ్వాక్రాలనీ అదనీ, ఇదనీ యెంతో మంచిగా చూస్తాండాది. ఆమె కలిగిచ్చుకునిందంటే కలెట్రుతో మాట్లాడి యిద్దరూ అనుకోని న్యాయం చేయడానికొస్తే రెడ్డేం చేస్తాడు.... ముడ్డేం చేస్తాడు చెప్పు? మనమ్మి జీవితం మనం గదక్కా చూసుకోవాలా, నువు గమ్మున్నే సూస్తా వుండు ఎంత మంచి జరగతాదో" అంటూ మా యింటాయిన్ని చూసి, "నువు పద మావా మనం ఎమ్మార్వో కాడికి పొయ్యి మాట్లాడేసి కలెట్రు కాడికి నెల్లూరికి పొయ్యేసొస్తాము. పొద్దు

పోయినా పర్వాలేదు రేత్రయితేనే ఆమి యింటి కాడుంటాదంట...పదరా అబయా" అంటూ అందురూ మాట్లాడుకుంటా బయటికి పోయినారు.

నేనెవుర్నీ ఏమనీ ఆపలేకపోయినాను.

'ఆడముండ జెప్తే మనమినేదేందిలే?' అనుకుంటారు మా ఇళ్ళల్లో మొగోళ్ళు.

ఇదంతా మంచిగా జరగడం లేదని నా కన్పిస్తా వుండాది. ఆ మధుసూద న్నాయుడికేం బట్టి యిదంతా సెయడానకి... పెదరెడ్డినీ, వాళ్ళ కుటుంబాన్నీ యీదిలోకి లాగాలనే ఒక యిది గాకపోతే... ఆయనకెందుకీ వూసు. ఈ సారి ఎలెచ్చన్లలో పరువు పోయిన పెద్దరెడ్డిని పైకి లెయినీయగూడదని ఒక కచ్చ గాకపోతే...

నేనిట్లా యోచన సేస్తానే వుండాను. చీకటి పడిపోయే. రెడ్డోరి మనుషులు మా యింటి చుట్టూ తిరగడం కన్పించింది. నేను తలుపేసుకొని, యెనకాల ఒదిగి కూర్చున్నాను. రెడ్డి గమ్మునుండడు. ఏదో ఒకటి చేస్తాడు. ఈ లోపల నేనే ఏదయినా చెయ్యొచ్చు.

అరుణమ్మిని జుట్టు పట్టుకొని లాక్కొచ్చి యింట్లో పారేస్తామనుకున్నాను. కానీ రెడ్డోరింటి కాడికి అడుగు పెట్టాలంటే మొహం చెల్లడం లేదు . నేనే తప్పు చేసినట్లుగా వుండాది భయం... భయంగా... సరే నా కూతరు సేస్తే ఒకటి, నేను జేస్తే ఒగిటా?...

ఇట్టుండగానే మూడు దినాలయిపాయ... ఇదంతా పేపర్ల కేసినారంట. వూరంతా పాక్కి పోతా వుండాది. యాడ జూసినా మా మాటలేనంట. రేపు కలెట్రమ్మా, ఎమ్మారమ్మా వొస్తారంట... నన్నూ, మా యింటాయిన్నీ, పెదరెడ్డినీ, సురేషబయ్యనీ కూడ పంచాయితీకి పిలుస్తారంట...

అయ్యా సామీ ఈ న్యాయం నేన్జెయ్యలేనయ్యా... ఆ రెడ్డెమ్మకి అన్యాయం చేయలేను. ఆమె వుప్పు తిన్నదాన్ని ఎట్టయితే అట్టవతాది నా కూతురు బతుకు. నాకు నిజంగా యాం చెయ్యాలో తెలీడం లేదు సామీ, వీళ్ళు చెప్పేదంతా జరిగితే నేనింక మా రెడ్డి ముఖం, రెడ్డెమ్మ మొహం చూళ్ళేనయ్యా ఈ జనమలో.

...అందుకే యింత రేత్రి పూట పిచ్చిరెడ్డి తోపు కాడుండే పెద్దబాయి కాడికి పోతుండా దూకి సావడానికి... పోతాపోతా కాఫీలో గన్నేరుకాయ నూరి కలిపి అరుణమ్మి కిచ్చి పోతుండానయ్యా.

సావడానికి పోతా పోతా ఎవురయినా అబద్దం చెప్తారంటయ్యా.

నేన్చెప్పిందాంట్లో ఒక్క మాట కూడా పొల్లు లేదు సామీ...

దండాలయ్యా... నమస్తేసా...

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 11 జులై 1999*